సాక్షి
కుమురం భీం
ఆదివారం : 2 : జులై : 2023



అందని వైద్యం

9లో▶

తిర్యాణి మండలం రొంపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఏళ్లుగా వైద్యం అందక ఆదివాసీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఆలయంలో ఎమ్మెల్యే సక్కు పూజలు

ఆసిఫాబాద్: సీఎం కేసీఆర్ పర్యటన సక్సెస్ కాగా స్థానిక కేస్లాపూర్ హనుమాన్ మందిర్‌లో శనివారం ఎమ్మెల్యే సక్కు, జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్ పూజలు చేశారు. పెంటు, వెంకన్న, భీమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
34.0 /27.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వాన కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల గడువు ఈనెల 25వరకు పెంచినట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు బోర్డు నిబంధనల మేరకు ప్రవేశాలు కల్పించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఫొటో, సంతకం వివరాలు నమోదు చేయాలన్నారు.

రేడియాలజీ హబ్ ప్రారంభం



రేడియాలజీ హబ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా నిర్మించిన రేడియాలజీ హబ్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు స్థానిక జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రామకృష్ణ, సూపరింటెండెంట్ స్వామి, ఎంపీపీ మల్లికార్జున్, వైస్ ఎంపీపీ సుంకరి పెంటు, సర్పంచులు భీమేశ్, శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పే స్కేల్ అమలు చేయాలి

ఆసిఫాబాద్: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పేస్కేల్ అందించాలని సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు గోగు మల్లయ్య తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్‌తో పాటు రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. 17ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా 3,874 మంది పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు. తమకు పేస్కేల్ అమలు చేయాలని కోరారు.

'కనిపించే దేవుళ్లు వైద్యులు'



వైద్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: కనిపించే దేవుళ్లు వైద్యులని ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం డాక్టర్స్‌డేను పురస్కరించుకొని డీఎంహెచ్‌వో రామకృష్ణ, డీసీహెచ్ స్వామి, వైద్యులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యుల సేవలు కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ సుంకరి పెంటయ్య, సర్పంచులు భీమేశ్, శ్రీనివాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీఆర్టీ ఎస్‌ఏ అర్హత పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ పోస్టుల భర్తీకి ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు డీటీడీవో మణెమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎస్‌ఏ సాంఘికశాస్త్రం, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) పరీక్ష రాసే అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమపాఠశాలలో, హిందీ, ఇంగ్లిష్, గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ పరీక్ష రాసే అభ్యర్థులు బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హాజరు కావాలని వివరించారు.

గురుపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



సీఐకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నార్నూర్(జైనూర్): జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామంలోని సిద్ధేశ్వర సంస్థాన్‌లో గురుపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సిద్ధేశ్వర సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగిలే, సర్పంచ్ కాందారే బాలాజీ తెలిపారు. శుక్రవారం నూతన బాధ్యతలు స్వీకరించిన సీఐ మల్లేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. సిద్ధేశ్వర్ సంస్థాన్ విశిష్టతను వివరించారు. బందోబస్తు కల్పించాలని సీఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 2, 3 తేదీల్లో వేడుకలను సిద్ధేశ్వర్ సంస్థానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు మహారాష్ట్ర, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారన్నారు. కార్యదర్శి సుభాష్, సర్పంచ్ బాలాజీ, గ్రామపటేల్ రంగారావు దిలీప్ సుధాం ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో జోష్!

- సీఎం రాకతో శ్రేణుల్లో ఉత్సాహం
- వచ్చే ఎన్నికల్లో విజయంపై ధీమా
- సభ సక్సెస్ కావడంతో సంబరాలు



సాక్షి, ఆసిఫాబాద్: సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనతో అధికార పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఊహించని దానికంటే మిన్నగా సభ విజయవంతం కావడం.. సీఎం కేసీఆర్ కూడా ప్రజాప్రతినిధులను అభినందించడంతో బీఆర్‌ఎస్ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో వందశాతం గెలుస్తామని సీఎం ధీమా వ్యక్తం చేయడంతో పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఇటీవలే తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల పేరిట జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. 21రోజులపాటు పండుగలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించి ప్రజలతో అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు మమేకమయ్యారు. ఉత్సవాలు ముగిసిన వారంలోపే సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన ఖరారు కావడం .. పర్యటనను విజయవంతం చేయాలన్న ఏకైక లక్ష్యంతో స్థానిక ప్రజాప్రతినిధులు విభేదాలు పక్కన పెట్టి ఒక్కటిగా పనిచేయడం పార్టీశ్రేణులు శుభసూచకంగా భావిస్తున్నారు.

వేడెక్కుతున్న రాజకీయం

సాధారణ ఎన్నికలకు గడువు ముంచుకొస్తోంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనే తలంపుతో ఉన్న అధికారపార్టీ నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేయడంతో జిల్లాలో రాజకీయ వేడి క్రమంగా రాజుకుంటోంది. ముఖ్యంగా ఆసిఫాబాద్ టికెట్ కోసం ఇద్దరు నేతల మధ్య పోటీ నెలకొంది. గత ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా పోటీచేసిన కోవ లక్ష్మి ఓటమి పాలుకాగా, కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన ఆత్రం సక్కు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వచ్చే ఎన్నికల్లో అధిష్టానం వీరిలో ఎవరికి టికెట్ ఇస్తుందోననే ఉత్కంఠ కార్యకర్తల్లో నెలకొంది. తమకే టికెట్ దక్కుతుందన్న ధీమాతో ఇద్దరూ పోటాపోటీగా నియోజకవర్గాన్ని చుట్టి వస్తున్నారు. పర్యటనలో భాగంగా సీఎం కూడా ఈ విషయంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సిర్పూర్ టికెట్ విషయంలో స్పష్టత ఉన్నప్పటికీ కోనేరు కోనప్పకు ఈ ఎన్నికలు సవాల్‌గా నిలుస్తాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో బీఎస్పీ, బీజేపీతోపాటు కాంగ్రెస్ కూడా బలంగానే ఉంది. ముఖ్యంగా బీఎస్పీ అధినేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇక్కడి నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేయగా కోనప్ప విజయం కోసం కష్టపడాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే గత ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీ చేసి కోనప్ప గెలవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. అయితే కేసీఆర్ ఛరిష్మా, బలమైన పార్టీ కేడర్ అండతో వచ్చే ఎన్నికల్లో గెలుస్తామనే ధీమాను అధికారపార్టీ ఎమ్మెల్యేలు వ్యక్తం చేస్తున్నారు. పైగా అధిష్టానం కూడా బీజేపీ, కాంగ్రెస్ తదితర పార్టీలు బలపడకుండా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏదేమైనప్పటికీ సీఎం కేసీఆర్ పర్యటనతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది.

ప్రతిపక్షాలను ఊపిరాడనీయకుండా..

వచ్చే శాసనసభ ఎన్నికల్లో వందశాతం గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్న సీఎం కేసీఆర్ ఆ దిశగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పావులు కదుపుతున్నారు. 10 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా దశాబ్దాలుగా పోడు భూముల హక్కుల కోసం పోరాడుతున్న గిరిజనులకు శుక్రవారం తన చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమానికి జిల్లా కేంద్రాన్ని వేదికగా శ్రీకారం చుట్టి ఆదివాసీల మనసు్సు దోచేప్రయత్నం చేశారు. వారికి త్రీఫేజ్ విద్యుత్‌ను ఉచితంగా అందజేస్తామని ప్రకటించారు. రైతుబంధు కూడా తక్షణమే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు సమీపించే నాటికి ఆదివాసీల్లో తమ బలాన్ని మరింత పెంచుకునేలా సీఎం వరాల జల్లు కురిపించారు. చాపకింద నీరులా దూసుకువస్తున్న కాంగ్రెస్ ఆసిఫాబాద్‌లో తన పట్టు నిరూపించుకోవాలని చూస్తోంది. గత ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున గెలిచిన ఆత్రం సక్కు అనంతరం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. అప్పట్లో పార్టీశ్రేణులు తీవ్ర నిరాశకు గురైనా.. ఇప్పుడు ఆ పార్టీ రాష్ట్ర పగ్గాలు రేవంత్‌రెడ్డి చేపట్టడడంతో జిల్లాలో కాంగ్రెస్ మళ్లీ బలంగా పుంజుకోవాలని వ్యూహాలు రచిస్తోందన్న సందర్భంలో సీఎం జిల్లాకు రావడం.. సభ జనసందోహంతో కిక్కిరిసిపోవడం ఆ రెండు పార్టీలకు కునుకులేకుండా చేసిందన్న ప్రచారం జరుగుతోంది.

'స్టాండింగ్' లేని కమిటీలు..!

- ఉపయోగించుకోని పాలకవర్గాలు
- సమావేశాలకు ఆహ్వానించని వైనం
- పనితీరు పర్యవేక్షించని అధికారులు
- పరిష్కారానికి నోచుకోని సమస్యలు



సాంగ్వి గ్రామపంచాయతీ కార్యాలయం

కెరమెరి(ఆసిఫాబాద్): గ్రామాలాభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలనే ఉద్దేశంతో నియమించిన స్టాండింగ్ కమిటీలు (స్థాయీసంఘాలు) నిరుపయోగమయ్యాయి. పర్యవేక్షణ, సమీక్షలు లేక వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. 2014లో ఏర్పాటైన ఈ కమిటీలు పనిచేస్తున్నాయా? సభ్యులు సమావేశాలకు వస్తున్నారా? సలహాలు, సూచనలు ఇస్తున్నారా? అనే విషయాలపై జిల్లాస్థాయి అధికారులు ఆరా తీయడంలేదు. చాలామంది అధికారులకు అసలు ఈ కమిటీలున్నాయన్న విషయం కూడా తెలియక పోవడం గమనార్హం. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సమస్యలు, లోపాలను ఎప్పటికప్పుడు ప్రజల తరఫున పాలక మండలి దృష్టికి తీసుకువెళ్లినపుడు గ్రామపరిపాలన మెరుగైన స్థాయిలో సాగుతుంది. ఇందుకు గ్రామపంచాయతీలకు స్టాండింగ్ కమిటీలను నూతన పంచాయతీరాజ్ చట్టం 2018లోని 49(1) నిబంధన ప్రకారం ఏర్పాటు చేశారు. ఈ నిబంధన ప్రకారం ప్రతీ గ్రామపంచాయతీకి స్టాండింగ్ కమిటీని తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి.

జిల్లాలో 1,340 కమిటీలు

జిల్లాలోని 335 గ్రామపంచాయతీల పరిధిలో 1,340 స్టాండింగ్ కమిటీలున్నాయి. గ్రామపంచాయతీ పాలక మండలికి అనుబంధంగా వీటి పనితీరు ఉంటుంది. ఒక్కో కమిటీ ఒక్కో పనికి ఉద్దేశించింది. పారిశుధ్యం, డంపుయార్డు, శ్మశాన వాటిక, విద్యుత్ నిర్వహణ తదితర అంశాల్లో పాలక మండలికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉటుంది. శ్మశానవాటిక, మౌలిక సదుపాయాల్లో ఇబ్బందులేర్పడితే.. మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోతే వెంటనే గ్రామపంచాయతీకి పాలకులు సమాచారం అందించి సమస్యలు పరిష్కరించేందుకు సహకరించాలి. స్టాండింగ్ కమిటీ సభ్యులు వీధి దీపాలు పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు విద్యుత్ పొదుపు చర్యలకు సహకరించాలి. ఎక్కడైనా వీధి దీపాలు వెలగకపోతే గ్రామపంచాయతీకి సమాచారం ఇవ్వాలి. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, పచ్చదనం పెంపొందించడం ప్లాంటేషన్ కమిటీ బాధ్యత వహించాలి. ప్రజాపనులు, అంగడికి సంబంధించిన పర్యవేక్షణ, సూచనలు చేయడం పనుల కమిటీకి సంబంధించిన అంశం.

కమిటీల పాత్ర నామమాత్రమే..

స్టాండింగ్ కమిటీలకు పంచాయతీరాజ్ చట్టంలో ప్రాధాన్యం ఇస్తూ నిబంధనలు రూపొందించినప్పటికీ క్షేత్రస్థాయిలో వీటికి అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కమిటీల్లోని సభ్యులు స్వచ్ఛందంగా పని చేయాలి. ఎలాంటి గౌరవ వేతనం ఉండదు. వారికి నయాపైసా కూడా ప్రభుత్వం చెల్లించదు. ఉపసర్పంచ్ ఎన్నికల్లో ఎలాంటి ఓటు హక్కు ఉండదు. అయినప్పటికీ గ్రామాభివృద్ధికి వీరి సలహాలే కీలకం. అయితే వారిని పాలకవర్గాలు గ్రామసభలకు కూడా ఆహ్వానించడం లేదనే ఆరోపణలున్నాయి. చాలా మంది కమిటీ సభ్యులకు తమ విధులేమిటో కూడా తెలియదనే విమర్శలున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కమిటీలను నామమాత్రంగా వేసి వివరాలు ఉన్నతాధికారులకు పంపి చేతులు దులుపుకొన్నారనే ఆరోపణలున్నాయి. మరోవైపు చాలా గ్రామాల్లో పంచాయతీ పాలకులు, జిల్లా అధికారులు కూడా స్టాండింగ్ కమిటీలనేవి ఉన్నాయనే విషయాన్ని మరిచిపోయినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్టాండింగ్ కమిటీలతో ప్రతీనెల సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి వాటి పనితీరును మెరుగుపరిస్తే గ్రామాల్లో సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని పలువురు భావిస్తున్నారు.

కమిటీలను విస్మరించారు



గ్రామపంచాయతీలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీలను పాలకులు ఎప్పుడో మరిచిపోయారు. అసలు ఈ కమిటీలు ఉన్నట్లు కూడా అధికారులకు గుర్తులేదు. కమిటీ సభ్యులతో నెలకోసారి సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

– కంబాల వినేశ్, విద్యుత్ కమిటీ సభ్యుడు, కెరమెరి

అవగాహన కల్పించాం



స్టాండింగ్ కమిటీలు ఏర్పాటు తర్వాత కమిటీ సభ్యులకు వారివారి విధులపై అవగాహ న కల్పించాం. ప్రతీ సమావేశానికి హాజరు కావాలని కోరాం. అమూల్యమైన సలహాలు ఇవ్వాలని గతంలోనే సూచించాం. కానీ.. సభ్యులెవరూ హాజరు కావడం లేదు.

– తొడసం జగన్నాథ్‌రావు, సర్పంచ్, సాంగ్వి

భక్తిశ్రద్ధలతో అకాడి పండుగ



వనదేవతకు మొక్కుతున్న ఆదివాసీలు

కెరమెరి: 'వన దేవతలారా.. ఈ నాలుగు నెలలు పాములు, తేళ్లు, పులుల నుంచి మమ్మల్ని కాపాడండి' అని మండలంలోని చిన్నసాకడ గ్రామ ఆదివాసీలు వనదేవతలైన రాజుల్‌పేన్, పేర్సపేన్, ఏస్మాసార్, ఆకిపేన్‌కు మొక్కుకున్నారు. శనివారం అకాడీ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఇళ్లలో పూజలు చేసిన అనంతరం అడవుల్లోకి వెళ్లి వనదేవతకు పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, పశు, పక్షాదులు, ఇంటిల్లిపాది సుఖఃసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. వనంలో వంటకాలు చేసి వనదేవతకు నైవేద్యం సమర్పించారు. కోడితో పంచాంగం చెప్పించారు. సంప్రదాయ వాయిద్యాలతో పాటలు పాడారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, పెద్దలు, దేవారి, కటోడాలు పెందోర్ దంబిరావు, సోయాం భీంరావు, పెందోర్ జలపతిరావు, జంగు, అర్జున్, సోము, గుణవంత్‌రావు హాజరయ్యారు.

నిత్యావసరాల పంపిణీ

సాక్షి ఎఫెక్ట్

దహెగాం: మండల కేంద్రానికి చెందిన నిరుపేద పశువుల కాపరి బోరె లస్మయ్య కుటుంబ దీనగాథపై 'సాక్షి'లో గత నెల 29న 'తాటికమ్మల గుడిసెలోనే..!' శీర్షికన ప్రచురించిన కథనానికి మండల కేంద్రానికి చెందిన కళాకారుల సంఘం జిల్ల ప్రధాన కార్యదర్శి గురిజాల రాజబాబు స్పందించారు. శనివారం లస్మయ్య కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. లస్మయ్య కుటుంబానికి నెలనెలా నిత్యావసరాలు అందిస్తామని తెలిపారు. అలాగే తాటికమ్మల గుడిసెలో నివసిస్తున్న లస్మయ్య కుటుంబానికి రేకుల షెడ్డు నిర్మించేందుకు పలువురు దాతలు ముందుకువస్తున్నారు.



లస్మయ్యకు నిత్యావసరాలు ఇస్తున్న రాజబాబు

ప్రశాంతంగా గ్రూప్-4 పరీక్ష

- 87శాతం మంది హాజరు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో గ్రూప్-4 పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగినట్లు అదనపు కలెక్టర్ రాజేశం తెలిపారు. 33 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. 8,251 మంది అభ్యర్థులకు ఉదయం నిర్వహించిన పేపర్-1 పరీక్షకు 7,245 మంది హాజరు కాగా 1,006 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం పేపర్-2 పరీక్షకు 7,198 మంది హాజరు కాగా 1,053 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లాలోని సిర్పూర్ (టీ) వాంకిడి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లోని కేంద్రాలను ఆయన పర్యవేక్షించారు. టీఎస్‌పీఎస్సీ నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

ఖైదీలే.. కర్షకులై..

- వ్యవసాయ క్షేత్రంగా జిల్లా జైలు
- సేంద్రియ విధానంలో పంటల సాగు
- నాటుకోళ్ల పెంపకం, విక్రయాలూ..
- సత్ప్రవర్తన కేంద్రంగా మార్చిన అధికారులు



ఎలక్ట్రికల్ అంశంలో శిక్షణ పొందుతున్న ఖైదీలు

వారంతా ఖైదీలు.. వేర్వేరు కేసుల్లో శిక్ష అనుభవిస్తున్నారు.. క్షణికావేశంలో నేరం చేసిన వారు కొందరైతే.. చెడు సహవాసం, పగలు, ప్రతీకారంతో తప్పు చేసి వచ్చినవారు ఇంకొందరు. ఇలాంటి వారిని కూడా సన్మార్గంలో నడిచేలా తీర్చిదిద్దుతున్నారు ఆదిలాబాద్ జిల్లా జైలు అధికారులు. ఖైదీలకు మంచిని వివరిస్తూ.. కారాగారాన్ని పూర్తిస్థాయిలో సత్ప్రవర్తన కేంద్రంగా మార్చేశారు. శిక్షణ అనంతరం వారి కాళ్లపై వారు నిలబడేలా తీర్చిదిద్దుతున్నారు. కష్టించేతత్వాన్ని అలవరుస్తూ సాగులో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. కర్షకులుగా మార్చి వారికి బతుకుబాట చూపుతున్నారు. జైలులో ఉన్న ఖాళీ స్థలాన్ని వ్యవసాయ క్షేత్రంగా మలిచి సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టారు. దిగుబడిని జైలు అవసరాలకు ఉపయోగించడంతోపాటు మార్కెట్‌లో కూడా వాటి విక్రయాలు చేపడుతున్నారు. తాజాగా నాటుకోళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. కఠిన హృదయాలను కూడా కరిగించి.. వారికి జీవితం విలువ తెలిసేలా చొరవ చూపుతున్న ఆదిలాబాద్ జిల్లా జైలుపై ప్రత్యేక కథనం.

– కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌టౌన్

రకరకాల పండ్ల మొక్కలు

జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌లో గల జిల్లా జైలు 28 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఇందులో పదెకరాల్లో జైలు, అధికారులు, సిబ్బంది నివాస గృహాలతో కూడిన భవన సముదాయం ఉంది. మిగతా సుమారు 18 ఎకరాలు ఖాళీగా ఉండటాన్ని గుర్తించిన అధికారులు దాన్ని వ్యవసాయ క్షేత్రంగా మార్చారు. ఆరెకరాల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. ఇందులో రెండు ఎకరాల్లో టేకు, మరో ఎకరంలో దానిమ్మ, సీతాఫల్, రామఫల్, లక్ష్మణ్‌ఫల్, బేర్ ఆపిల్, అంజీర్, జామ పండ్ల మొక్కలు నాటారు. అవి వృక్షాలుగా ఎదిగి ఫలసాయం అందిస్తున్నాయి. మిగతా స్థలంలో డ్రాగన్‌ఫ్రూట్, బొప్పాయితోట ఏర్పాటు చేశారు. వీటికి పైపులైన్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. రసాయనిక ఎరువుల జోలికి వెళ్లకుండా పూర్తిగా సేంద్రియ విధానంలోనే సాగు చేస్తున్నారు. జైలులో పోగయ్యే చెత్తాచెదారం, చెట్ల నుంచి రాలిన ఆకులు, పశువుల పేడనే ఎరువుగా మార్చుతున్నారు. అలాగే చేపలు, నాటుకోళ్ల పెంపకం కూడా చేపడుతున్నారు.

కూరగాయలు కూడా..

మరో ఎనిమిది ఎకరాల్లో టమాటా, వంకాయ, సోర, చిక్కుడు, అలచంద, బీర, బెండ, మునగ తదితర కూరగాయల సాగు చేస్తున్నారు. అంతర పంటగా పాలకూర, మెంతి, తోటకూర, గోంగూర, బచ్చలికూరతో పాటు తృణధాన్యాలైన రాగులు, కొర్రలు, సామలు కూడా వేస్తుండడం గమనార్హం. పూల సాగుకు మరో ఎకరం కేటాయించారు. గతేడాది అర ఎకరంలో ప్రత్యేకంగా చేపల చెరువు కూడా ఏర్పాటు చేసి వేలాది చేప పిల్లలను వేశారు. వేసవిలో అది ఎండిపోయింది. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురిస్తే మళ్లీ చేపలు పెంచేందుకు సన్నద్ధమవుతున్నారు.

నాటు కోళ్ల పెంపకం, విక్రయాలు

జైళ్ల శాఖ వరంగల్ డీఐజీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు నాటుకోళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. మొదటి బ్యాచ్‌లో 250 కోళ్లను తీసుకువచ్చి ఆరు నెలలుగా పెంచుతున్నారు. వీటి కోసం అర ఎకరం స్థలంలో ప్రత్యేక షెడ్‌తో పాటు మునగ తోట ఏర్పాటు చేశారు. ఇక్కడ పండించే ఆకు కూరలతో పాటు రాగులు, కొర్రలు, సామలు, జొన్నలు అందిస్తూ పెంచుతున్నారు. కోళ్లు పెరగడంతో రెండు రోజుల క్రితం విక్రయాలు కూడా ప్రారంభించారు. కిలోకు రూ.350 చొప్పున జైలు వద్దే విక్రయిస్తున్నారు.

150 మంది ఖైదీలతో..

ఇక్కడ శిక్ష అనుభవిస్తున్న 150 మంది ఖైదీల ద్వారా ఈ సాగు చేపడుతున్నారు. దిగుబడిని జైలు అవసరాలకు వినియోగిస్తున్నారు. రైతుబజార్‌లోనూ విక్రయిస్తున్నారు. ఈ విధానంతో ఖైదీల్లో సత్ప్రవర్తన తెస్తోంది. వారు మానసికంగా ఉండేందుకు దోహదపడుతుందని జైలు అధికారులు చెబుతున్నారు.



జైలులో పెంచుతున్న నాటు కోళ్లు



జైలులోని నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజల్లో మంచి డిమాండ్ ఉంది



జైలులో పండించే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో పాటు నాటుకోళ్లకు ప్రజల్లో మంచి డిమాండ్ ఉంది. సేంద్రియ విధానంలోనే పండించే వాటిని ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. నాటు కోళ్లను రూ.350 కిలో చొప్పున విక్రయిస్తున్నాం. వాటికి రశీదులు కూడా అందజేస్తున్నాం. జైలు శిక్ష పడ్డ ఖైదీల్లో మార్పు తీసుకురావడంతో పాటు వారు బయటకు వెళ్లాక తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రత్యేక శిక్షణనిస్తూ ఉపాధి కల్పిస్తున్నాం. వ్యవసాయ క్షేత్రంలో పనిచేసే ఖైదీలకు రోజుకు రూ.70 ఇస్తుండగా.. ఇతర పనులు చేసే వారికి రూ.50, రూ.30 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. వారు బయటకు వెళ్లే సమయంలో పాస్‌బుక్ అందజేస్తాం. బీపీసీఎల్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే అది ప్రారంభమవుతుంది.

– పి.అశోక్‌కుమార్, జిల్లా జైలు సూపరింటెండెంట్, ఆదిలాబాద్

క్లుప్తంగా

రైలులోంచి కిందపడి ఒకరు మృతి

మందమర్రిరూరల్(చెన్నూర్): ప్రమాదవశాత్తు రైలులోంచి కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి–బెల్లంపల్లి రైలుమార్గంలోని నేషనల్ హైవే టోల్‌గేట్ సమీపంలో శనివారం దానాపూర్ రైలులోంచి ప్రమాదవశాత్తు కిందపడి బ్రితేష్‌రాజ్ (22) మృతి చెందినట్లు ఆయన తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రంలోని అజార్‌బాగ్ గ్రామానికి చెందిన యువకుడు కూలీ పనికోసం హైదరాబాద్ వెళ్తున్నాడు. తోటి ప్రయాణికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీరాంపూర్‌లో 104 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో జూన్ మాసం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 104 శాతం ఉత్పత్తిని సాధించడం జరిగిందని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ బీ సంజీవరెడ్డి తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏరియాలో సాధించిన బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. జూన్‌లో 4,97, 500 టన్నులకు గానూ 5,17,819 టన్నులు సాధించామన్నారు. భూగర్భగనుల్లో 99 శాతం, ఓపెన్ కాస్ట్ గనుల్లో 106శాతం ఉత్పత్తిని సాధించామన్నారు. ఏప్రిల్, నుంచి జూన్ 30 వరకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం ప్రకారం 84 శాతం ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. శ్రీరాంపూర్ లోని రెండు ఓపెన్ కాస్టుగనుల్లో ఓబి సమస్య వలన బొగ్గు ఉత్పత్తి కొంచెం తగ్గిందన్నారు. సింగరేణిలో కొత్తగా చేరుతున్న మహిళా ఉద్యోగులకు ఇప్పటి వరకు బదిలీ వర్కర్(సర్ఫేస్) డిజిగ్నేషన్‌ను కేటాయించామన్నారు. ఇక నుండి బదిలీ వర్కర్‌గా మాత్రమే ఇస్తూ కంపెనీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 2019 లో డీజీఎంఎస్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం భూగర్భ గనుల్లో కూడా మహిళా ఉద్యోగులు దిగి పని చేసేలా ఉత్తర్వులు విడుదలయ్యాయన్నారు. రూ.1.2 కోట్లతో సీసీసీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, దీనిద్వారా పారిశుధ్య వ్యర్థాలను శుద్ధిచేసి వాటి నుండి ప్లాస్టిక్ టైల్స్ కూడా తయారు చేయబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో డీజీఎం(పర్సనల్) అరవింద్‌రావు డీజీఎం(ఐఈడీ) చిరంజీవి, డీజీఎం(సివిల్) శివరావు, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు

చెన్నూర్: జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలు, 311 గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దయెత్తున నిధులు మంజూరు చేయడం హర్షణీయమని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. కుమురంభీం జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభలో జీపీకి రూ.10 లక్షలు, మున్సిపాలిటీ రూ. 25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారని తెలిపారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తోందని, నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

నైపుణ్య పాఠం.. భవితకు ఊతం

- కేజీబీవీల్లో ప్రత్యేక తరగతులు
- విద్యార్థినుల శక్తి సామర్థ్యాల పెంపునకు ప్రణాళిక


జీవన నైపుణ్యాలపై రూపొందించిన పుస్తకాలను కేజీబీవీ విద్యార్థినులకు అందజేస్తున్న ప్రత్యేకాధికారి అజ్మీర రజిత

నేరడిగొండ(బోథ్): చక్కని ప్రణాళికతో ఉత్తమ నైతిక విలువలను పెంపొందించుకుంటూ సమున్నతంగా జీవించేందుకు అవసరమైన నిరంతర ప్రక్రియే జీవన నైపుణ్యం. ప్రధానంగా కౌమారదశలో విద్యార్థినులను శారీరక, మానసిక భావోద్వేగాలు చుట్టుముడుతాయి. సమాజ స్థితిగతులపై అవగాహన ఏర్పర్చుకుంటూ మానసికంగా ఎదిగేందుకు అవసరమైన సామర్థ్యం పెంచుకోవడం విద్యార్థి దశలో ఎంతో అవసరం. జీవన నైపుణ్యాలు నేర్పితే వారి భవితకు బంగారుబాట వేసినట్లవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం జీవన గమనంలో ఎదురయ్యే ఆటుపోట్లను అధిగమిస్తూ ఒత్తిళ్లను తట్టుకునేందుకు కస్తూరిబాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్రత్యేక బోధనకు శ్రీకారం చుట్టింది. వీటికి సంబంధించిన 'జీవన నైపుణ్యాల విద్య' పుస్తకాలు ఇప్పటికే విద్యా సంస్థలకు చేరాయి. ఉమ్మడి జిల్లాలో కేజీబీవీలు 68 ఉండగా 8,160 మంది విద్యార్థినిలు 6,7,8 తరగతుల్లో విద్యను అభ్యసిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా కేజీబీవీల వివరాలు

జిల్లా	కేజీబీవీలు	విద్యార్థినుల సంఖ్య
ఆదిలాబాద్	17	2,040
నిర్మల్	18	2,160
కుమురంభీం	15	1,800
మంచిర్యాల	18	2,160

వేధింపులపై అప్రమత్తం..
చాలా మంది బాలికలు లైంగిక, ఇతర వేధింపులతో పాటు హింసను ఎదుర్కొంటున్నారు. లైంగిక హింస అంటే ఏమిటి? దాడులు ఎలా జరుగుతున్నాయి? వీటి బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? పరిచయం లేని వారితో ఎలా ఉండాలి? తదితర అంశాలను వివరిస్తారు.

6,7,8 తరగతులకు..
మొదట ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా 6, 7, 8 తరగతుల విద్యార్థినులకు అమలు చేస్తున్నారు. భవిష్యత్ పరిణామాలు అంచనా వేయడం, సహచర విద్యార్థినులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులతో అనుబంధాలపై బోధన ఉంటుంది. సాధారణంగా కేజీబీవీల్లో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినులే ఎక్కువగా చదువుతుంటారు. విద్యార్థినులు భవిష్యత్‌లో ఆసక్తి ఉన్న రంగంలో ఆర్థికంగా నిలదొక్కుకుని నైపుణ్యాలు పెంపొందించుకునేలా తరగతులు బోధించనున్నారు.

వారానికి మూడు తరగతులు
నూతన విద్యాసంవత్సరంలో కేజీబీవీల్లో వారానికి మూడు తరగతులు నైపుణ్య పాఠాలు బోధించేలా ప్రణాళికలు రూపొందించారు. విద్యాలయాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న బోధకులతోనే ఈ తరగతులు నిర్వహిస్తారు. సమగ్రశిక్షా అధికారులు ఇందుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలను కూడా కేజీబీవీలకు చేర్చారు.

బోధించే అంశాలివే..

- విద్యార్థినులు తమను తాము విశ్వసించుకునేలా వారిలోని బలాలు, బలహీనతలను తెలియజేయడం, భయాలు, అవకాశాలు, లక్ష్యాలు గుర్తించేలా చేయడం.
- ఇతరుల పాత్రలోకి ప్రవేశించి ఆలోచించే నైపుణ్యం, కోపం, విచారం, ఉద్వేగాలను ఎలా అర్థం చేసుకోవాలి? ఎలా నియంత్రించాలి? ఎదుటి వారితో సంయమనంతో ప్రవర్తించే పద్ధతులు తెలియజేయడం.
- సహచరుల ఒత్తిడి, భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, వాటిని నియంత్రించే విధానాలను అవలంభించేలా తీర్చిదిద్దడం.
- నిత్యం ఎదురయ్యే సవాళ్లు, సమస్యలకు గల కారణాలను గుర్తించడం, ప్రత్యామ్నాయ విధానాలతో పరిష్కరించడం.
- ఏదైనా సమాచారం, పరిస్థితి, సమస్యను పలు కోణాల్లో విశ్లేషించి క్షుణ్ణంగా అర్థం చేసుకుని పరిష్కరించే సామర్థ్యం పెంపొందించడం.
- భవిష్యత్ పరిణామాలను గుర్తించి సరైన అంశాన్ని ఎంచుకుని నిర్ణయం తీసుకునే శక్తిసామర్థ్యాలను అలవర్చడం.
- సమాజం పట్ల జీవన సానుకూల దృక్పదాన్ని అలవర్చడం, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల ప్రాధాన్యాన్ని వివరిస్తూ వారితో గౌరవ భావంతో ఉండేలా బోధించడం.
- సమస్యలు ప్రభావవంతంగా సృజనాత్మకంగా పరిష్కరించే విభిన్న కోణాలు తెలియజేయడం
- ఇతరులతో మాట్లాడే విధానం, ఇతరులు చెప్పే మాటలు వినగల సామర్థ్యాలు పెంపొందించడం.

పరిపూర్ణ జీవనానికి దోహదం



విద్యార్థినుల్లో ప్రతికూల ధోరణులు, ప్రమాదకర ప్రవర్తనలను నివారిస్తూ ఉత్తమంగా తీర్చిదిద్దేలా బోధించాలన్న లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. సానుకూల వైఖరి, ఉన్నత విలువలు పెంపొందించేలా బోధనాంశాలు పొందుపర్చారు. వారి పరిపూర్ణ జీవనానికి ఇది దోహదం చేస్తుంది.

– ఉదయశ్రీ, జీసీడీవో, ఆదిలాబాద్

మానవ తప్పిదాలతోనే గని ప్రమాదాలు


అవగాహన కల్పిస్తున్న సేఫ్టీ జీఎం గుప్తా

రెబ్బెన(ఆసిఫాబాద్): మానవ తప్పిదాలతోనే గనుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎస్ గుప్తా అన్నారు. ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో శనివారం సురక్షిత పని విధానాలు, పద్ధతుల అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు రక్షణ సంస్కృతిని పెంచాలన్నారు. సంస్థలో పని చేసే ప్రతి ఒక్కరు ఇంటి నుండి బయలు దేరే సమయం నుండి తిరిగి ఇంటికి చేరే వరకు అడుగడుగునా రక్షణ పద్ధతులు పాటించాలన్నారు. విధి నిర్వహణలో అన్నిరకాల రక్షణ పరికరాలను వినియోగించటంతో పాటు రక్షణ సూత్రాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. అనంతరం ఓబీ కాంట్రాక్టు కార్మికులకు రక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ తిరుమల్‌రావు, ప్రాజెక్టు ఇంజినీర్ రాజాజీ, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, ఇంజినీర్లు నరేశ్, శంకర్, చుక్కయ్య, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

నస్పూర్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)జమ్మూకశ్మీర్‌లో సీటు సాధించిన నస్పూర్‌కి చెందిన కోడం వర్షిణిని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యాక్రమంలో శాలువాతో సన్మానించి బహుమతిని అందించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షిణి హైదరాబాద్ మహేంద్రహిల్స్‌లోని సాంఘిక మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో విద్యను అభ్యసించి ఐఐఎంలో సీటు సాధించడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులాల సెక్రెటరీ రోనాల్డ్ రాస్, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో పంచాయతీ కార్మికుడు మృతి


మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

- వీధి దీపాలు అమరుస్తుండగా ఘటన
- న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన

బెల్లంపల్లిరూరల్: వీధి దీపాలు అమరుస్తుండగా విద్యుత్ స్తంభం పైనుంచి కిందపడి గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బెల్లంపల్లిరూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామానికి చెందిన రాచ కొండ పోశం, యశోద దంపతుల కుమారుడు రాచ కొండ ప్రశాంత్(26) బుధాకుర్దు గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా (గ్రామ పంచాయతీ కార్మికుడిగా) పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శనివారం గ్రామంలోని ఓ వీధిలో దీపాలు అమర్చేందుకు విద్యుత్ శాఖ లైన్‌మెన్ సహకారంతో ఎల్‌సీ తీసుకున్నాడు. స్తంభం ఎక్కి వీధి దీపం అమరుస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో కింద పడ్డాడు. తలకు గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో మూడు రోజు ల్లో అతనికి పెళ్లి చూపులు ఉన్నట్లు సమాచారం.

న్యాయం చేయాలని ఆందోళన...


ప్రశాంత్ (ఫైల్)

తమ కుమారుడి మృతికి సర్పంచ్, విద్యుత్‌శాఖ అధికారులే కారణమని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుని తండ్రి పోశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, కార్యదర్శి రత్నం ఐలయ్య, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేశ్, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంక్షిప్త వార్తలు

ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్
మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ట్రాఫిక్‌జాంతో ప్రజలు ఇబ్బందికి గురయ్యారు. గ్రూప్–4 పరీక్ష రాయడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు పరీక్ష రాసి తిరిగివెళ్లే సమయంలో ఒక్కసారిగి రోడ్డుపై గంటకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. పేషెంట్‌ను ఎక్కించుకుని వస్తున్న అంబులెన్స్ కూడా ట్రాఫిక్‌లోనే ఇరుక్కుపోయింది.

సికిల్‌సెల్, రక్తహీనత పరీక్షలు
మందమర్రిరూరల్: గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు, బడిపిల్లలకు సికిల్‌సెల్, రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తామని ట్రైనీ కలెక్టర్ గౌతమి అన్నారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతగా 4360 మందికి పరీక్షలు చేస్తామని, వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్ ఫయాజ్‌ఖాన్, నీరజ, మండల వైద్యాధికారి రమేష్, ఎంపీపీ గుర్రం మంగ, జెడ్పీటీసీ వేల్పుల రవి, వైద్య సిబ్బంది ఉన్నారు.

విదేశాల్లో ఉపాధ్యాయ ఉద్యోగావకాశాలు
పాతమంచిర్యాల: విదేశాల్లో టీచర్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. దోహ, ఖతార్ దేశాల్లోని ఇంటర్నేషనల్ పాఠశాలల్లో బోధించడానికి సోషల్ స్టడీస్, ఆర్ట్, ఎకానామిక్స్, డ్యాన్స్, మదర్‌టీచర్లుగా పని చేయడానికి బీఈడీ గ్రాడ్యుయేట్లు, 25–45 ఏళ్ల వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టాంకాం) తెలంగాణ కార్మిక ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ కార్యాలయం హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటీఐ కాంప్లెక్సులో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు
బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన ఓ చిన్నారి మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడు. మహ్మద్ అయాన్ తాజ్ నృత ప్రదర్శనల్లో చూపిన ప్రతిభాపాటవాలకు అవార్డు ప్రకటించారు. హైదరాబాద్ కేంద్రంగా ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 9న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ హాల్‌లో భారతీయ నృత్యోత్సవాలు, అవార్డుల ప్రధానం నిర్వహించనున్నారు. కిడ్స్ స్టార్ విభాగంలో ఆయాన్ తాజ్ ఎంపికైనట్లు సంస్థప్రతినిధులు బ్రాజ్‌కిశోర్, సురేష్‌బాబు, అరుణకుమారి, స్వప్న, మహేష్, తోట సుధారాణి ప్రకటించారు.

'బీసీ జనాభా లెక్క తేలితేనే రిజర్వేషన్లు'
పాతమంచిర్యాల: బీసీల జనాభా లెక్క తేలితేనే బీసీలకు రిజర్వేషన్లు, సంక్షేమ ఫలాలు సమానంగా అందుతాయని బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గాండ్ల తిలకేశ్వర సంఘం కార్యాలయంలో బీసీ జనగణనపై బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనగణన చేపట్టాలని దేశవ్యాప్తంగా బీసీలు ఉద్యమించి జనగణనను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలో బీసీల ఐక్య సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు.

ఇద్దరిని బలిగొన్న అతివేగం

- అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు
- ఇద్దరు దుర్మరణం.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలో ఘటన
- నిర్మల్ జిల్లా జామ్‌లో విషాదం


అబ్దుల్ సమీర్ మృతదేహం


అలీమొద్దీన్ మృతదేహం


అబ్దుల్ సమీర్(ఫైల్)


అలీమొద్దీన్(ఫైల్)

దంతాలపల్లి: అతివేగంతో వచ్చిన కారు అదుపుతప్పి రోడ్డుపై పల్టీలు కొడుతూ రోడ్డుపక్కన ఉన్న చెట్టు, విద్యుత్ స్తంభం మధ్యలో చిక్కుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. మృతులు నిర్మల్ జిల్లావాసులు. స్థానికులు, ఎస్సై కూచిపూడి జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన అన్వర్‌ఖాన్ ఖమ్మం జిల్లా మధిరలో హైడ్రాలిక్ క్రేన్ కొనుగోలు చేశాడు. దానిని తీసుకువచ్చేందుకు శుక్రవారం రాత్రి 10.30 గంటలకు నిర్మల్ నుంచి కారులో డ్రైవర్ అబ్దుల్ సమీర్(21), క్రేన్ డ్రైవర్ షేక్ అలీముద్దిన్(21), హెల్పర్ షేక్ రెహాన్‌తో కలిసి అన్వర్‌ఖాన్ బయలు దేరారు. శనివారం తెల్లవారుజామున దంతాలపల్లి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలోకి రాగానే గేదె అడ్డు రావడం.. అప్పటికే కారు వేగం మీద ఉండడంతో అదుపుతప్పి రోడ్డుపై 20 మీటర్ల దూరం వరకు పల్టీలు కొట్టింది. ఆ తరువాత రోడ్డు పక్కన ఉన్న చెట్టు, విద్యుత్‌స్తంభానికి మధ్యలో చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంలో అలీముద్దిన్ అక్కడికక్కడే మృతి చెందగా కారుడ్రైవర్ అబ్దుల్ సమీర్ ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. అన్వర్‌ఖాన్, రెహాన్‌కు తీవ్రగాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు సమీర్ మామ మహ్మద్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తొర్రూరు సీఐ సత్యనారాయణ ఈ ప్రమాదానికి గల కారణాలను విచారణ చేపట్టనునట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ప్రమాద సమయంలో కారు అతివేగం మీద ఉందని, అందుకే కారు గాలిలో ఎగురుతూ పల్టీలు కొట్టినట్లు స్థానికులు తెలిపారు.

ఇరుకుటుంబాల్లో అంతులేని విషాదం
సారంగపూర్: అలీమొద్దీన్‌కు ఆరుగురు అక్కాచెల్లెల్లు. చిన్నతనంలోనే తండ్రి ఇమాముద్దీన్ మృతి చెందడంతో కుటుంబ భారం తల్లి రుక్సానా బేగంపై పడింది. బీడీలు చుడుతూ పిల్లలను పెంచి పెద్దచేసింది. పెద్దకుమార్తె రియానాను అన్వర్‌కు ఇచ్చి వివాహం చేసింది. అప్పటినుంచి తన బావమరిది అయిన అలీమొద్దీన్‌ను తనవద్దే క్రేన్ ఆపరేటింగ్ నేర్పించి పనిలో పెట్టుకున్నాడు. వచ్చే జీతంతో మరో ముగ్గురు నుజ్జుబేగం, రుబీనా, రేష్మల వివాహం చేశాడు. ఇంటి భారం తానే మోస్తూ ఇంటికి పెద్దదిక్కుగా నిలిచాడు. ఇదే సమయంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబలించడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది.

సమీర్‌ది నిరుపేద కుటుంబమే....
అబ్దుల్ సమీర్ తండ్రి వాహిద్ దివ్యాంగుడు. అటవీశాఖలో రోజువారీ కూలీ కింద వాచర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి అంజూబేగం బీడీలు చుడుతూ కుటుంబానికి బాసటగా నిలుస్తోంది. వీరికి సమీర్ ఏకైక సంతానం. రెండేళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరగా నిలిచాడు. ఇదే సమయంలో అనుకోని రీతిలో కారు ప్రమాదం జరగడంతో తన ఒక్కగానొక్క కుమారుడి మృతిని ఆతల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవ వేడుకలు


టీ–హబ్ కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యులు

మంచిర్యాలటౌన్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని టీ–హబ్‌లో ప్రభుత్వ వైద్యులు శనివారం కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. టీ–హబ్ ప్రారంభోత్సవానికి హాజరైన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రరెడ్డి, సీహెచ్‌సీ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ అరవింద్ సమక్షంలో వైద్యుల సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సృజన, నీలవేణి, శాలిని, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో
డాక్టర్స్ డే సందర్భంగా మంచిర్యాల సఖి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, డాక్టర్ స్వరూప, డాక్టర్ శరత్‌బాబులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు బండ శాంకరి, సెక్రెటరీ కరుణ, కోశాధికారి మహేశ్వరి, సభ్యులు శివరాణి, కట్ల భాగ్యలక్ష్మి, చక్రధర్, స్వర్ణ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి


ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం ఆయన నస్పూర్‌లోని ఈవీఎం గోదామును ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాములోని ఈవీఎం, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు వీవీపాట్‌లను పరిశీంచామని అన్నారు. ఈవీఎం గోదాము సీసీ కెమెరా పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రక్తదానం మహాదానం


రక్తదాతకు సర్టిఫికెట్ ఇస్తున్న జీఎం

శ్రీరాంపూర్: అన్నిదానాల్లో కెల్ల రక్తదానం గొప్పదని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం డాక్టర్స్‌డేను పురస్కరించుకుని శ్రీరాంపూర్‌లోని ఆర్కే 8 డిస్పెన్సరీలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వీటీసీలో శిక్షణ పొందుతున్న 40 మంది యువ కార్మికులు రక్తదానం చేశారు. వారికి జీఎం సంజీవరెడ్డి ప్రశంసపత్రాలు అందజేశారు. 50వ సారి రక్తదానం చేస్తున్న వీటీసీ శిక్షకుడు రాజ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు శ్రీరాంపూర్ వీటీసీ నుండి 18 సార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించడం గర్వించదగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, ఏజీఎం ఫైనాన్స్ మురలీధర్, ఏజెంట్ ఏవి రెడ్డి, డీజీఎం (పర్సనల్) అరవింద్‌రావు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంవీటీసీ మేనేజర్ రామారావు, వైద్యులు వేద వ్యాస్, లోకనాథ్‌రెడ్డి, స్వప్న పాల్గొన్నారు.